కలుషిత నీటి సమస్యను పరిష్కరిస్తాం



బతుకమ్మకుంటలో కలుషిత నీటి సరఫరాను పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

నల్లకుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మ కుంటలో సాయికాంప్లెక్స్‌లో వారం రోజులుగా కలుషిత నీటి సరఫరాతో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మంచినీటి సరఫరా సమయంలో గంటపాటు కలుషిత నీటిని వదిలేసి తర్వాత పట్టిన నీరు సరిపోవడం లేదన్నారు. ఈ విషయంపై బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధానకార్యదర్శి కె.మహేష్‌కుమార్‌కు స్థానిక ప్రజలు ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన ఆయన మంగళవారం జలమండలి ఏజీ మాజీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణల దృష్టికి తీసుకెళ్లి ఆ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఇందుకు స్పందించిన జలమండలి అధికారులు వారం, పది రోజుల్లో ఈ కలుషితనీటి సమస్యను గుర్తించి చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.

రంబుల్ స్ట్రిప్స్‌ను పరిశీలించిన యంత్రాంగం

మే 1వరకు రోడ్లపై ఇబ్బందులు లేకుండా చేస్తాం : ఆర్‌అండ్‌బీ డీఈ



ఛేనెంబర్ ఫ్లైఓవర్‌పై రంబుల్ స్ట్రిప్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

గోల్నాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ఛేనెంబర్ ఫ్లైఓవర్‌పై రంబుల్ స్ట్రిప్స్‌ను అధికార యంత్రాంగం మంగళవారం పరిశీలించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన అంబర్‌పేట ఛేనెంబర్ ఫ్లైఓవర్‌పై రంబుల్ స్ట్రిప్స్ ట్రబుల్స్ వార్తకు అధికారులు స్పందించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ డీఈ ధర్మారెడ్డి, అధికారులు, జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులు ఫ్లైఓవర్‌పై రంబుల్ స్ట్రిప్స్‌ను పరిశీలించారు. ఫ్లైఓవర్‌పై 50ఫీట్లకు ఒక రంబుల్ స్ట్రిప్స్ ఉండడంతో వాహనదారులకు ప్రమాదభరితంగా మారింది. దీంతో అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మే 1వ తేదీ వరకు వీటన్నింటితో పాటు రోడ్లన్నీ బాగు చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ ఈడీ ధర్మారెడ్డి చెప్పారు. సమస్యపై సత్వరంగా స్పందించి చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొనడం పట్ల బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ జూ.కళాశాలలో 60 శాతం ఉత్తీర్ణత

- **975 మార్కులతో మొదటి స్థానంలో నిలిచిన సూరం కీర్తి**

బర్కత్‌పుర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. మంగళవారం ఇంటర్ ఫలితాలు వెలువడిన విషయం విదితమే. మొదటి, ద్వితీయ సంవత్సరంలో ఈ కళాశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలో వెయ్యి మార్కులకు గాను సూరం కీర్తి 975 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. అభిరామ్ 973 మార్కులు సాధించి ద్వితీయస్థానంలో నిలిచారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ ఇంగ్లిస్ మీడియంలో 490 మార్కులకు గాను అనేక విద్యార్థిని 448 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. నేరాహత్‌అలీ 431, కీర్తన సిరంగి 425 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం సీఈసీలో చెరుకుల యశ్వంత్ 500 మార్కులకు గానూ 437 మార్కులు సాధించాడు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎ.చిరంజీవి, సీనియర్ అధ్యాపకులు ఇ.ప్రసాదరావు అభినందించారు.

జస్టిస్ గోపాల్‌రెడ్డికి సన్మానం



జస్టిస్ గోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

నల్లకుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ చైర్మన్‌గా జస్టిస్ ఎ.గోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. దీంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం టీపీసీసీ కార్యదర్శి ఎస్.అజయ్‌కుమార్, ఏఐజేఈసీ సదరన్ జోన్ అధ్యక్షుడు బి.కాంతారావు తదితరులు జస్టిస్ గోపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం అధ్యక్షురాలు దేవిరెడ్డి విజితారెడ్డి, నాయకులు భూదాన్ సాగర్‌రెడ్డి, ఎం.మధుసూదన్‌రెడ్డి, సీహెచ్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభ

బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ



ముషీరాబాద్‌లో తెలంగాణ జాగృతి జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, పరకాల మనోజ్ కుమార్ గౌడ్

ముషీరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోతుందని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లో తెలంగాణ జాగృతి నగర నాయకుడు పరకాల మనోజ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బహిరంగ సభ విజయవంతం కోసం వాల్ రైటింగ్, తెలంగాణ జాగృతి జెండా విష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జైసింహా మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద ప్రాంతీయ పార్టీగా బీఆర్‌ఎస్ ఎదిగిందన్నారు. బీఆర్‌ఎస్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివెళ్లాలన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో వాడవాడలా ఎమ్మెల్యే ముఠా గోపాల్ సారథ్యంలో పండుగ వాతావరణ ఉట్టిపడేలా వాల్ రైటింగ్, జెండా ఆవిష్కరణలు బ్యానర్‌లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అతిథులను పరకాల మనోజ్‌కుమార్‌గౌడ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు శివ ముదిరాజ్, టెంట్‌హౌస్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ వివిధ డివిజన్‌ల అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, మాజీ డివిజన్ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్, మహ్మద్ అలీ, నాయకులు జావిద్ ఖాన్, శ్రీకాంత్ యాదవ్, బాబూ, మహిళా కమిటీ అధ్యక్షురాలు శోభ పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిన ముషీరాబాద్ నేతలు

ముషీరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ బహిరంగ స్థలాన్ని పరిశీలించేందుకు తరలి వెళ్లారు. బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, ఆరు డివిజన్ల నుంచి బీఆర్‌ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, శంకర్‌ముదిరాజ్, రాకేష్‌కుమార్‌తో పాటు నాయకులు శివముదిరాజ్, ఆకుల అరుణ్‌కుమార్, శ్రీనివాస్, శంకర్‌గౌడ్, మహ్మద్ అలీ తదితరులు బహిరంగ సభ స్థలానికి వెళ్లారు.

పఠాన్‌బస్తీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

- **యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్**



జలమండలి జీఎం రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న అరవింద్ కుమార్ యాదవ్, నాగభూషణం గౌడ్ తదితరులు

ముషీరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ పఠాన్ బస్తీలో దశబ్దాకాలంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అరవింద్ కుమార్ యాదవ్‌తో కలిసి జలమండలి జీఎం రామకృష్ణను కలిసి డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాన్ని అందజేశామని అయినప్పటికి సమస్య పరిష్కరించలేదని ఆరోపించారు. నిత్యం డ్రైనేజీ లీకేజీ వల్ల పఠాన్‌బస్తీలోని అమీర్‌గరీబ్ దుకాణం నుంచి డ్రైనేజీ మురుగునీరు ఏరులై పారడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు అంజియాదవ్, ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, మైనార్టీ కమిటీ నియోజకవర్గం అధ్యక్షుడు డాక్టర్ మినాజ్, నగరకార్యదర్శి రాజ్‌దీప్, నాయకులు రమేష్ గౌడ్, రహీం, నియాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మనీష్ అగర్వాల్ తదితరులు

27 నుంచి గీతా సమ్మర్ క్యాంపు

నల్లకుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ కూకట్‌పల్లి ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి మే 6వ తేదీ వరకు గీతా సమ్మర్ క్యాంపు- 2025 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. 6 నుంచి 15 సంవత్సరాల వయసు గల పిల్లల కోసం ప్రతిష్టాత్మకంగా ఈ క్యాంపు నగరంలోని డీఆర్‌ఎస్ ఇంటర్నేషన్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అగర్వాల్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మనీష్ అగర్వాల్, ఇస్కాన్ కూకట్‌పల్లి సంస్థ ప్రతినిధులు డాక్టర్ సీమా జైన్, సరళషా, సుభావిలాస్‌వాస్, రాజేందర్, కనక తదితరులు మాట్లాడారు. జీవితంలోని సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను అలవర్చే ఉద్దేశంతో ఇస్కాన్ కూకట్‌పల్లి 35 సంవత్సరాలుగా ఈ శిబిరాలను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాల్లో పిల్లలకు మానవీయ విలువలు, వేద సంస్కారాలను బోధిస్తున్నట్లు తెలిపారు. గౌరవం, పర్యావరణం, పరిరక్షణ, ఆరోగ్యకర జీవనశైలి, కుటుంబ విలువలు, జీవిత నైపుణ్యాల అభివృద్ధి, ఈత, డ్రాయింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, సంస్కృత శ్లోకాల శిక్షణ, యోగా, సంప్రదాయ నృత్యాలు, గానం వంటి అంశాలపై శిక్షణ కల్పిస్తున్నామన్నారు. ఈ క్యాంపు - 2025 కార్యక్రమం ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందని, పిల్లల కోసం బస్సు పికప్, డ్రాప్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాల కోసం ప్లాట్ నెంబర్ 4, కమల్ ప్రసన్న నగర్ కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్, పిన్‌కోడ్ 500072లో లేదా 9652675974 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

డివిజన్‌లో సమస్యలు లేకుండా చర్యలు



పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని బస్తీలు, కాలనీల్లో ఎలాంటి సమస్యలూ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ వివరించారు. మంగళవారం డివిజన్‌లోని అకాల వర్షాల వల్ల రోడ్లపై నిలిచిపోయిన వరద నీటిని తొలగించే పనులు ఆమె పర్యవేక్షించారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి పలు ప్రాంతాలు పర్యటించారు. అదేవిధంగా కచ్చామోరీ పైప్‌లైన్‌లలో నిలిచిపోయిన మట్టిని చెత్తాచెదారాన్ని తొలగించే పనులు కూడా ఆమె పర్యవేక్షించారు. మోర్ సూపర్‌మార్కెట్, కెనరాబ్యాంక్ పార్క్, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మే 4న ఆరెకటిక సంఘానికి ఎన్నికలు



ఆరెకటిక సంఘం ఎన్నికలను ప్రకటిస్తున్న నాయకులు

నల్లకుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గుర్తింపు పొందిన కాచిగూడ ఆరెకటిక సంఘానికి (152/2019) ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు మంగళవారం నగరంలోని సంఘం కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక ట్రస్ట్ చైర్మన్ జామాల్పూర్ బాల్‌రాజ్ ఎన్నికల తేదీని ప్రకటించారు. ఈ సంఘానికి మే 4వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ నెల 23, 24వ తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 25న ఉపసంహరణ, 26న స్క్రూటినీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆరె కటిక ఎలక్షన్ కమిటీ కార్యదర్శి డాక్టర్ నిజాంకారి చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి: వక్తలు

కవాడిగూడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సమగ్ర భూసర్వే నిర్వహించి భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి అధ్యక్షతన భూభారతి చట్టం భూ సమస్యలన్నీ పరిష్కరిస్తుందా? అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.సాగర్, రిటైర్డ్ సర్వే జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు, సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, రైతు సంఘం నాయకులు బొంతల చంద్రారెడ్డి, మూడ్ శోభన్, ఆర్.వెంకట్ రాములు, డీజీ.నర్సింహారావు, ప్రభులింగం, డీజీ.నరేంద్రప్రసాద్, జక్కుల వెంకటయ్య, రవీందర్‌గౌడ్ తదితరులు హాజరై మాట్లాడారు. సమగ్ర భూసర్వే జరగకుండా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం దొరకదన్నారు. వివిధ శాఖల కింద ఉన్న భూములను రెవెన్యూ శాఖలోకి మార్చి సమస్యలను పరిష్కరించాలన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు ఇంటి స్థలాలు తిరిగివ్వాలి

తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమురెల్లి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం కొమురెల్లి తదితరులు

నల్లకుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 1991లో నాలుగు ఉద్యోగ సంఘాలలోని ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి గ్రామంలో సర్వే నెంబర్ 36, 37లలో 427 ఎకరాలను కేటాయించిందని తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం కొమురెల్లి గుర్తుచేశారు. అయితే తమకు న్యాయం చేయడంలో గత కేసీఆర్ ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా తమకు న్యాయం చేయడం లేదని ధ్వజమెత్తారు. విశ్రాంత ఉద్యోగులకు ఇంటిస్థలాలను తిరిగి వెనక్కి వచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తమకు న్యాయం చేయని పక్షంలో త్వరలో సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తూము అశోక్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోట్ల సూర్యకళ, కోశాధికారి జె.ప్రకాష్‌రావు, ఉపాధ్యక్షుడు ఝాన్సీరాణి, సభ్యులు లక్ష్మణ్‌రావులతో కలిసి ఆయన మాట్లాడారు. బీటీఎన్జీవోస్, గచ్చిబౌలి మ్యాక్ హౌసింగ్ సొసైటీ వాటాగా 189.11 ఎకరాలు ఇచ్చినట్లు, లాటరీ పద్ధతిన ప్లాట్ల పంపిణీ జరిగిందన్నారు. జీవో 633 జీఏడీ శాఖ 1992 ప్రకారం సర్వీసు సీనియారిటీ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ప్లాట్ల పంపిణీ చేయాలి కానీ తద్విరుద్ధంగా లాటరీ రద్దుచేశారని అన్నారు. ఈ విషయంపై కోర్టును ఆశ్రయించగా తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి ఇళ్ల నిర్మాణాలు చేపట్టొద్దని హైకోర్టు సొసైటీని ఆదేశిస్తూ స్టే ఆర్డర్ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే కేసీఆర్ ప్రభుత్వం 2014లో ఇళ్లు నిర్మించుకోలేదన్న కారణం చూపించి తమ సొసైటీ 189.11 ఎకరాలను వెనక్కి తీసుకుందని ఆరోపించారు. కేసీఆర్ చేసిన ద్రోహం వల్ల గత పదేళ్ల నుంచి తాము ఇళ్ల స్థలాలు తిరిగి పొందడానికి పోరాటం చేస్తున్నామన్నారు. 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఫిబ్రవరిలో కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఇందుకు స్పందించిన మంత్రి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నుంచి నివేదిక తెప్పించుకుని తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కానీ నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అయితే ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డిని కలువడానికి గత పది నెలల నుంచి ఎదురుచూస్తున్నప్పటికీ ఆయన అపాయింట్‌మెంట్ కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కటకం జానకి, పవన్‌కుమార్, శ్రీదేవి, యాదగిరి, జయసేనారెడ్డి, స్వర్ణకుమారి, రుద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల డైరెక్టర్ రామకృష్ణరావుకు వినతిపత్రం అందజేస్తున్న ట్రస్మా నేతలు

ఇంటర్నల్ మార్కులు, గ్రేడింగ్ వ్యవస్థను కొనసాగించాలి

ముషీరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎస్‌సీ విద్యార్థుల కోసం ఇంటర్నల్ మార్కులు, గ్రేడింగ్ వ్యవస్థను తిరిగి యధావిధిగా కొనసాగించాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి కోరారు. మంగళవారం ట్రస్మా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కృష్ణారావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎన్‌రెడ్డి, విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... మార్కుల విధానాన్ని తిరిగి కొనసాగించడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల కార్పొరేట్ సంస్థలకు మేలు జరిగే అవకాశం ఉందన్నారు. గతంలో అంతర్గత మార్కులు, గ్రేడింగ్ విధానం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడేది అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రేడింగ్ విధానాన్ని యధావిధంగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి



సాయికుమార్‌ను సన్మానిస్తున్న భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం నాయకులు

ముషీరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, మత్స్య సంపద పెంపొందించేందుకు ప్రభుత్వం అంకిత భావంతో కృషిచేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. మంగళవారం మెట్టు సాయికుమార్‌ను భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం సీనియర్ నాయకుడు కేఎం.సాయి ఆధ్వర్యంలో పలువురు గంగపుత్రులు కలిసి మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం ఆయనకు మెమొంటో ఇచ్చి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు వినోద్, నితిన్, గోవింద్, బిజ్జి కనకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేయసికి పెళ్లి.. ప్రియుడి బలవన్మరణం

కవాడిగూడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతికి వివాహం కావడంతో ఓ యువకుడు జీవితంపై విరక్తిచెంది ఉరేసుకున్నాడు. ఈ సంఘటన ముషీరాబాద్ పీఎస్ పరిధిలోని భోలక్‌పూర్ ఇందిరానగర్‌లో సోమవారం రాత్రిచోటు చేసుకుంది. ముషీరాబాద్ సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్‌లో నివాసం ఉండే గణేష్(20) పదో తరగతి వరకు చదువుకుని, పద్మారావునగర్‌లోని ఓ ఫిట్‌జిమ్‌లో పనిచేస్తున్నాడు. అతడి తల్లి జయశ్రీ సమీపంలోని బంగ్లాదేశ్ దుస్తులషాపులో పనిచేస్తోంది. చిలకలగూడలో ఓ యువతిని గణేష్ ప్రేమించాడు. ఇటీవల ఆ యువతికి వివాహం కావడంతో గణేష్ ఇందిరానగర్‌లో ఇంట్లో సోమవారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సాయంత్రం దుస్తుల షాపు నుంచి ఇంటికి వచ్చి చూడగా ఆమె కుమారుడు ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. ముషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గణేష్ తల్లి ఫిర్యాదు మేరకు ముషీరాబాద్ సీఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

కవాడిగూడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నిబంధనల ప్రకారం.. ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దోమలగూడ పోలీసులు వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మద్యం షాపులు బంద్ ఉన్న విషయం విదితమే. అయితే చిక్కడపల్లి ప్రాంతంలో నివాసం ఉండే కిష్టప్ప, ఆనంద్ అనే వ్యక్తులు ఉదయం 6 నుంచి 7 గంటల ప్రాంతంలో ఇందిరాపార్కు చౌరస్తాలో ఓ బ్యాగులో 25 మద్యం క్వార్టర్ బాటిళ్లను తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దోమలగూడ పోలీసులు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో దాడి చేశారు. చౌరస్తాలో మందు బాటిళ్లను విక్రయిస్తున్న కిష్టప్పను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబట్టాడు. మరో వ్యక్తి ఆనంద్ తృటిలో తప్పించుకుని పరారయ్యాడు. అతని నుంచి 25 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దోమలగూడ ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

'కృషి, ప్రతిభకు ఎప్పటికైనా గుర్తింపు వస్తుంది'

చిక్కడపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కృషి, ప్రతిభకు ఎప్పటికైనా తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ప్రముఖ సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం అన్నారు. కార్యదక్షుడిగా, విశేష పరిశోధకుడిగా సంజయ్ కిషోర్ సాంస్కృతిక రచనా రంగాల్లో చేస్తున్న కృషి ప్రతిభకు విశ్వవిద్యాలయాలు గుర్తించి గౌరించే సందర్భంగా తప్పక రావాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ అభినందన ఆధ్వర్యంలో సినీ పరిశోధకుడు, సంగమం ఫౌండేషన్ స్థాపకుడు సంజయ్‌కిషోర్‌కు చిక్కడపల్లిలోని అభినందన కార్యాలయంలో సన్మానసభ మంగళవారం సాయంత్రం జరిగింది. ముఖ్యఅతిథిగా పార్వతీశం పాల్గొని మాట్లాడుతూ సంజయ్‌కిషోర్ సేకరించిన ఛాయాచిత్రాలు మూడున్నర లక్షలకు పైగా ఉన్నాయంటే ఆయన పరిశోధన ప్రతిభ అర్థం చేసుకోవచ్చునన్నారు. అభినందన కార్యదర్శి ఇ.భవాని మాట్లాడుతూ సంజయ్‌కిషోర్ 45 ఏళ్ల సాంస్కృతిక ప్రస్థానానికి గుర్తింపుగా చేసిన సత్కారం ఇది అన్నారు. ఈ కార్యక్రమంలో శోభా పేరిందేవి తదితరులు పాల్గొన్నారు.